కథ

# తియ్యనైన జ్ఞాపకం

కె.బి.కృష్ణ

జ్ఞాపకాలు మనిషికి భగవంతుడు ఇచ్చిన అమూల్యమైన వరాలు, తీపి జ్ఞాపకాలు మనసును ఉర్రూతలూగిస్తూ పరవశం కలగచేస్తే, బాధించేవి. మనిషిని వేధించేవి కొన్ని, అయితే ఇవి లేకుంటే మనిషి జీవితమే లేదు.

నా చిన్ననాటి స్నేహితుడు వచ్చాడు మా ఇంటికి, మేం కలిసి చాలాకాలమైంది, " అన్నయ్యగారూ అందరూ బావున్నారా" అంటూ మంచినీళ్ళ గ్లాసుతో నా శ్రీమతి వచ్చింది "బాగానే ఉన్నామమ్మా" అన్నాడు వాడు మంచినీళ్ళు తాగి.

మేం కబుర్లు చెప్పుకుంటాంటే, రెండు పళ్ళాల్లో బంగినపల్లి మామిడిపళ్ళు తొక్క తీసి ముక్కలు కోసి ఫోర్క్ పెట్టి పంపించింది శ్రీమతి లోపలినుండి. ఆ మామిడిపండు ముక్కలు టి.వీలో వచ్చే మామిడి డ్రింక్ ప్రకటనలో లాగ మామిడి రంగులో మెరిసిపోతూ నోరూరిస్తున్నాయి. నా మిత్రుని ముఖం అదోలా అయిపోవడం నేను గమనించాను.

" అరె మామిడిపళ్ళ ముక్కలు పంపించిందా చెల్లాయి" అన్నాడు.

" అదేంట్రా ?"

" నేను మామిడిపళ్ళు తినడం మానేసేను రా"

" అదేమిటి రా కాశీలో వదిలేశావా?"

" కాదు "

" మరి "

" నీకు తెలుసుకదా మాకు రాజమండ్రి పక్కన శ్రీకృష్ణపట్నంలో పధ్నాలుగు ఎకరాల పొలం ఉండేది. ఆ పొలంలో వరిపంట కాకుండా మా తల్లితండ్రులు సంవత్సరంలో అన్ని ఋతువులలో దొరికే పండ్లు పండించేవారు. అలాగ మాకు జామ, సపోటా, సీతాఫలం, బత్తాయి, నారింజ వగైరా పళ్ళన్నీ వచ్చేవి. అలాగే మల్లెలూ, మందారాలూ, జాజి, విరజాజి పూలు కూడా పూసేవి. ఇవి గాక అదనంగా మా అమ్మానాన్నలకు మామిడిపండ్లంటే ఎంత ఇష్టమో చెప్పలేను. అందువలన మామిడిపళ్ళలో ఎన్ని రకాలు ఉన్నాయో అన్నీ వేయించారు. జీడిమామిడి చెట్లతో పాటుగా అని రకాల మామిడి చెట్లు కూడా మా తోటలో ఉండేవి. ముఖ్యంగా బంగినపల్లి, పంచదారకలిశెలు, కొత్తపల్లికొబ్బరి, చెఱుకురసాలు మా తోటలో కాసే ప్రత్యేకమైన పళ్ళు, చెఱుకురసమైతే ఒక్కోపండూ మోచేతి పొడుగు ఉండి ఆ పండును ఒక్కరు తినలేకపోయే వారు. మా తోటలో పండే మామిడిపళ్ళ రసమాధుర్యం తలుచుకుంటేనే ఇప్పటికీ నోరంతా లాలాజలం నిండిపోయి గొంతులో గుటకలు పడక ఉక్కిరి బిక్కిరి అవుతూంటాను. ముఖ్యంగా మా అమ్మగారికి, నాన్నగారికీ మామిడిపళ్ళంటే విపరీతమైన ఇష్టం. రోజూ ఒక రకం మామిడిపండు భోజనంలో తినేవారు ఇద్దరూ. నా ఊహ వస్తున్న సమయంలో ఒకరి తరువాత ఒకరు మా అమ్మా నాన్నా స్వర్గస్థులయ్యారు. మా కుటుంబం దిక్కులేనిదైపోయింది. ఎలా బ్రతికానో చెప్పలేను.

నాకు మామిడిపళ్ళు తింటూంటే మా అమ్మానాన్నలు గుర్తుకు వచ్చి బాధ కమ్ముకుంటుంది. అలాగే వాళ్ళు అప్యాయంగా, అబగా, మామిడిపళ్ళు తింటున్న దృశ్యం గోచరిస్తూ ఉంటుంది. మా నాన్నగారైతే చెఱుకు రసం ఒక్కరే తినేసేవారు. అంత ఇష్టం ఆయనకు. టెంకలో రసం లేకుండా పీచును చేసేసేవారు. నా మనోఫలకంపై ఈ దృశ్యాలన్నీ ప్రత్యక్షమై పండు తింటున్నంతసేపూ కళ్ళ నిండా నీళ్ళు నిండేవి. అప్పుడు నా శ్రీమతి "ఆ నీళ్ళేమిటి కళ్ళల్లో" అనేది. అందుకే వాళ్ళకోసమని మామిడిపళ్ళు తినడం మానేశాను ఈ వ్యథ భరించలేక. "చెబుతున్న నా మిత్రుని కళ్ళ నుండి ధారాపాతంగా కన్నీరు స్రవిస్తోంది.

"అదేంట్రా చాలా కాలానికి కలిశాం. ఎందుకలాగ? వద్దులే మామిడిపళ్ళు తినవద్దులే ఇదిగో ఎక్కడున్నావ్. ఈ పళ్ళ ముక్కలు లోపలికి తీసుకువెళ్ళిపో" అని శ్రీమతిని కేకేశాను విసుగుగా.

"అరేయ్. అమ్మా నాన్నా లేకపోవడం మనిషికి శాపం కదూ. గత జన్మలో చేసిన పాపఫలం కదూ" అంటూ వాడు కళ్ళు తుడుచుకుంటున్నాడు, నాకూ కనులు తడి అయ్యాయి నా తల్లి తండ్రీ గుర్తుకు వచ్చి.

వాడి వయసు సుమారు డెబ్భై సంవత్సరాలు అయితే, నా వయసు రెండేళ్ళు తక్కువ, అయితే ఈ వయసులో చంటిపిల్లవాడిలా అమ్మానాన్నల కోసం ఏడవడమా? పిచ్చివాళ్ళం కదూ మేము.

"అమృతం తాగినవాళ్ళూ దేవతలూ దేముళ్ళూ వాళ్ళే అమ్మా నాన్నలూ" అంటూ టి.వీ లో "అమ్మా నాన్న" అనే ప్రత్యేక కార్యక్రమం వస్తోంది. తల్లి తండ్రీ విలువ ఏమిటో నేటి యువతకు తెలియచేయడానికి దాన్ని ప్రసారం చేస్తున్నారుట.

అవును అమ్మానాన్నా "అమృతం త్రాగిన వాళ్ళే"